క్లుప్తంగా

పేదలకు అన్నదానం



తెనాలిఅర్బన్: మెగాస్టార్ చిరంజీవి తనయుడు గ్లోబర్ స్టార్ రామ్‌చరణ్ పుట్టిన రోజు వేడుకలను ఆయన అభిమానులు మంచాల రమేష్, సొమరౌతు సతీష్ సంయుక్త ఆధ్వర్యంలో రైల్వే స్టేషన్ రోడ్డులోని శ్రీ శివలింగేశ్వర స్వామి భక్త బృంద సేవా సమితి అన్నదాన కేంద్రంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. అక్కడ ఏర్పాటు చేసిన కేక్‌ను జనసేన నేత నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం కట్ చేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అభిమానులు గ్యాలం వేణు, తోట పానకాలరావు, గాంధీ, పోకల రమేష్, వెల్పూల గంగాధరరావు, మంచాల సురేష్, నాగం సురేష్, తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌కు అండగా నిలుద్దాం

దావులూరు(కొల్లిపర): ప్రజా సంక్షేమానికి అహర్నిశలు శ్రమిస్తున్న జగనన్నకు ప్రజలు అండగా నిలవాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివ కుమార్ తనయుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్ కోరారు. బుధవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని దావులూరు నాగరాజు పాలెంలో స్థానిక నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి ఓటర్ల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక వసతులు

నియోజకవర్గ ఈఆర్ఓ, జేసీ రాజకుమారి



మంగళగిరి: పోలింగ్ కేంద్రాలలో ఓటర్లకు అవసరమైన అన్ని మౌలిక వసతులు ఏర్పాట్లు పూర్తి చేయాలని నియోజకవర్గ ఎన్నికల రిటరి ్నంగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. బుధవారం సెక్టార్ 15,16 లలోని 15 పోలింగ్ కేంద్రాలను పరిశీలించి మౌలిక వసతులను పరిశీలించారు. విద్యుత్ సౌకర్యం, ఫ్యా న్లు, లైట్లు పనిచేస్తున్నాయా, లేదా అని పరిశీ లించారు. పోలింగ్ కేంద్రాలలో పోలింగ్‌కోసం కా వల్సి న ఫర్నిచర్, ఓటర్లకు తాగునీటి సౌకర్యం, మరుగు దొడ్లు, గ్రౌండ్ లెవలింగ్, క్యూలైన్ల ఏర్పాట్లపై సూచనలు చేశారు. ఎన్నికల నిబంధనలను పటిష్టంగా అమలు చేయాలన్నారు. రాజకీయ పార్టీలు ఎన్నికల నియమావళి ఉల్లంఘిస్తే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఏఈ ఆర్ఓ ఎస్.ప్రకాశరావు, తహసీల్దార్ కె.వెంకటేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

'ప్రియదర్శిని'లో క్యాంపస్ ప్లేస్‌మెంట్



తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని చింతపూడి గ్రామంలో ఉన్న ప్రియదర్శిని ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం క్యాంపస్ ప్లేస్‌మెంట్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చైర్మన్ చందు రామారావు, సెక్రటరీ చందు విజయలక్ష్మి విచ్చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు రేడియంట్, స్పైక్వాడ్, కియా, ప్రీమియర్ ఎనర్జీ తదితర కంపెనీల వారు తమ కళాశాల విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ నిర్వహించారని, ఈ కార్యక్రమంలో ప్రియదర్శిని టెక్నాలజీ అఫ్ మేనేజ్‌మెంట్, రేపల్లె పాలిటెక్నిక్, దివిసీమ పాలిటెక్నిక్ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారని మొత్తం 6 కంపెనీల్లో 145 మంది విద్యార్థులు ఉద్యోగాలు పొందారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఎ.రామారావు, విష్ణు ఉమెన్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాఘవేంద్ర, గవర్నమెంట్ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ బాల శంకర్, దివిసీమ పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కె.రేష్మ, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, శ్రీనివాసరావు, డి.మస్తాన్, అల్లామ్, అనూష, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో జీజీహెచ్ ప్రసూతి విభాగం

గుంటూరు మెడికల్: జీజీహెచ్ ప్రసూతి విభాగంలో భారత పరిశ్రమల సమాఖ్య సహకారంతో రూ.70 లక్షలతో ఆధునికీకరించిన 40 పడకల వార్డును ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్ కుమార్‌కు బుధవారం అప్పగించారు. ఈ సందర్భంగా డాక్టర్ కిరణ్ కుమార్ మాట్లాడుతూ ప్రసూతి విభాగాన్ని కార్పొరేట్ స్థాయిలో ఉండేలా సిద్ధం చేశారని చెప్పారు. వార్డుకు మూడు టీవీలను సమకూర్చారు. ఏసీలను పూర్తి స్థాయిలో అమర్చారు. వేసవి కాలంలో తల్లి బిడ్డ హాయిగా ఉండే విధంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణ బాబు, డీఎంఈ డాక్టర్ నరసింహం సహకారంతో రూపొందించినట్లు వెల్లడించారు.

దళిత గృహాల్లో ఉచిత విద్యుత్ కాంతులు

- 200 యూనిట్లు వరకు రాయితీ ఇస్తున్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వం
- నాలుగున్నరేళ్లలో ఎస్సీ, ఎస్టీలకు రూ.కోట్లలో లబ్ధి
- టీడీపీ పాలనలో నామమాత్రపు రాయితీ
- దళిత బాంధవుడిగా పేదల హృదయాల్లో నిలిచిన సీఎం జగన్



కొల్లిపర మండల విద్యుత్ సబ్‌స్టేషన్

కొల్లిపర: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎస్సీ, ఎస్టీల గృహాల్లో విద్యుత్ కాంతులు విరజిమ్ముతున్నాయి. సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రజా సంక్షేమాన్ని కోరి అనేక పథకాలను ప్రవేశపెట్టి పూర్తి స్థాయిలో అమలు చేశారు. ఎస్సీ , ఎస్టీల ఇళ్లల్లో విద్యుత్ వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో 200 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్ ఇస్తామనే హామీని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పక్కాగా అమలు చేయటంతో ఎస్సీ, ఎస్టీ కుటుంబాల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

200 యూనిట్ల లోపు ఉచితం

కొల్లిపర మండలంలో 70 శాతం మంది ఎస్సీ, ఎస్టీలు నిరుపేదలే. వీరంతా కాయ కష్టం చేసుకుంటూ జీవిస్తున్నారు. ఎక్కువ మంది వ్యవసాయ కూలీ పనులపై ఆధారపడి జీవిస్తున్నారు. నెలకు 200 లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా విద్యుత్ ఇస్తోంది. గతంలో 50 శాతం మందికి విద్యుత్ సౌకర్యం ఉండేది కాదు. బిల్లులు చెల్లించే స్తోమత లేక విద్యుత్ కనెక్షన్ తీసుకునే వారు కాదు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చాక ఉచిత విద్యుత్‌తో పాటు రాయితీపై కనెక్షన్ ఇస్తున్నారు. నెలకు 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారికి ప్రభుత్వం బిల్లులు రద్దు చేసింది. టీడీపీ హయాంలో కేవలం 100 యూనిట్లు మాత్రమే రాయితీ ఇచ్చేవారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఈ రాయితీని 200 యూనిట్లకు పెంచింది. అర్హత ఉన్న ప్రతి ఎస్సీ, ఎస్టీలకు ఉచితంగా విద్యుత్ కనెక్షన్ కూడా అందించారు. కొల్లిపర మండలంలో మండల కేంద్ర సబ్ స్టేషన్ పరిధిలో 20 గ్రామ పంచాయతీలలో ఈ నాలుగున్నరేళ్లలో 21,040 మంది ఎస్సీలకు 2,111 మంది ఎస్టీలకు ఈ పథకం వల్ల లబ్ధి చేకూరింది. సంబంధిత విద్యుత్ సంస్థలకు ఎప్పటికప్పుడు విద్యుత్ బిల్లులు ప్రభుత్వం జమ చేస్తోంది.

2019 నుంచి 2024 ఫిబ్రవరి వరకు కొల్లిపర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎస్సీలు పొందిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రాయితీ (కోట్లలో)
2019-20	4059	0.87
2020-21	4187	1.21
2021-22	4143	1.29
2022-23	4213	1.43
2023-24(ఫిబ్రవరి)	4438	1.78

2019 నుంచి 2024 ఫిబ్రవరి వరకు కొల్లిపర విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో ఎస్టీలు పొందిన లబ్ధి

సంవత్సరం	లబ్ధిదారుల సంఖ్య	రాయితీ
2019-20	395	రూ.9లక్షలు
2020-21	415	రూ.12 లక్షలు
2021-22	419	రూ.13లక్షలు
2022-23	423	రూ.15 లక్షలు
2023-24(ఫిబ్రవరి)	459	రూ.18లక్షలు

సీఎం జగన్‌కు రుణపడి ఉంటాం



టీడీపీ హయాంలో విద్యుత్ బిల్లు నెలకు రూ.300 నుంచి రూ.400 వరకు వచ్చేది. సీఎం జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత 200 యూనిట్ల లోపు వాడిన వారికి ఉచిత విద్యుత్ పథకం వర్తింపజేశారు. దీంతో నేను ఏడాదికి రూ.5వేల వరకు విద్యుత్ బిల్లు ద్వారా లబ్ధి పొందాను. సీఎం జగనన్నకు రుణపడి ఉంటాం.

కనపర్తి ధనమ్మ, ఎస్సీ , తూములూరు.

ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు



రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తోంది. ఉచిత విద్యుత్ పథకం ఆయా వర్గాల వారికి ఎంతగానో మేలు చేకూరుస్తోంది. వారు వినియోగించే విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే భరిస్తోంది. ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న జగనన్న ఎస్సీ, ఎస్టీలకు ఎంతో మేలు చేశారు.

అద్దంకి బోసుబాబు, ఎంపీటీసీ సభ్యుడు, దావులూరు.

ఉచిత విద్యుత్ పథకం హర్షణీయం



ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ హామీని నెరవేర్చిన సీఎం జగనన్న దళితుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారు. చాలా మంది దళితులు కాయ కష్టం చేసుకుని బతుకుతున్నారు. కూలీ పనులు చేసుకుని జీవిస్తున్న ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్ పథకం అమలు చేయడం హర్షణీయం.

బొంతు వేణుగోపాలరెడ్డి , సర్పంచ్, చివలూరు.

అర్చకులపై దాడి హేయమైన చర్య

పట్నంబజారు: కాకినాడలో అర్చకులపై దాడి చేసిన ఘటన సిగ్గుచేటని బ్రాహ్మణ సామాజిక వర్గం నేతలు బందా రవీంద్రనాథ్, కార్పొరేటర్ ఈచంపాటి కృష్ణ, మల్లేపల్లి హనుమంత శర్మ పేర్కొన్నారు. బ్రాడీపేటలోని వారి కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎల్లో మీడియా అర్చకులపై జరిగిన దాడిని కూడా రాజకీయ రంగు పులమడం దుర్మార్గమన్నారు. అర్చకులపై దాడి చేసిన నిందితుడికి కఠినంగా శిక్ష పడాలని డిమాండ్ చేశారు. ఒక ప్రముఖ దినపత్రిక అధినేత కావాలనే ఉద్దేశపూర్వకంగా కులాల మధ్య విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. టీడీపీని అధికారంలోని తెచ్చేందుకు ఆయన తపన పడుతున్నారని, కృష్ణా పుష్కరాల సందర్భంగా ఆధునికీకరణ పేరుతో టీడీపీ నేతలు అనేక దేవాలయాలను కూల్చివేశారని ఆరోపించారు. ఎవరెన్ని కుటలు చేసిన రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వెంటనే బ్రాహ్మణ సామాజిక వర్గం నడుస్తుందని పేర్కొన్నారు.

4 రోజుల్లో ముగియనున్న వడ్డీ రాయితీ గడువు

నెహ్రూనగర్: పన్ను బకాయి దారులకు ఏక మొత్తంగా చెల్లించిన వారికి కల్పించిన వడ్డీ రాయితీ గడువు మరో 4 రోజులు మాత్రమే ఉందని నగర కమిషనర్ కీర్తి చేకూరి బుధవారం తెలిపారు. పన్ను బకాయిదార్లు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, ఏప్రిల్ ఒకటి నుంచి పన్నుపై వడ్డీ జమ అవుతుందని పేర్కొన్నారు. నగర ప్రజలు ఈ నెలాఖరులోగా తమ ఆస్తి, ఖాళీ స్థల పన్నులు పూర్తిగా చెల్లించి వడ్డీ రాయితీ పొందాలని కోరారు. నెలాఖరు వరకు వేచి చూడకుండా ముందుగానే పన్ను చెల్లించాలని, నెలాఖరులో సర్వర్ సమస్యలు ఉత్పన్నమయ్యే అవకాశం ఉందని సూచించారు.

ఓటు ప్రాధాన్యాన్ని గుర్తెరగండి

మున్సిపల్ కమిషనర్ శేషన్న



మాట్లాడుతున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కుకు ఎంతో ప్రాధాన్యత ఉంటుందని దానిని గుర్తెరిగి అంతా తమ ఓటు హక్కును వచ్చే ఎన్నికల్లో వినియోగించుకోవాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న సూచించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్విప్ కార్యక్రమంలో భాగంగా పురపాలక సంఘం ఆధ్వర్యంలో గాంధీచౌక్‌లో ఓటు వినియోగంపై అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఉద్యోగులు ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేశారు. అందరూ ఓటు వినియోగించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే ఎన్నికల్లో ఓటు ద్వారా మంచి పాలకులను ఎన్నుకోవాలని తెలిపారు. అంతా స్వచ్ఛందంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. రాజకీయ పార్టీలు పెట్టే ప్రలోభాలకు లోనూ కాకుండా ఓటు వేయాలన్నారు. అనంతరం ఓటు వేస్తామనే ప్రతిజ్ఞను అందరితో చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ అనూష, ఏసీపీ సుబ్బారావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు రామచంద్రరావు, ప్రసాద్, శ్రీనివాస రావు, మెప్మా సీఎంఎం అరుణ, కోటి, తదితరులు పాల్గొన్నారు.

యాప్‌ల వినియోగంపై అవగాహన కల్పించండి

తెనాలిఅర్బన్: ఎన్నికల కమిషన్ రూపొందించిన యాప్‌లపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. బూత్ లెవల్ అవేర్నెస్ గ్రూప్ సభ్యులతో బుధవారం కొత్తపేటలోని రామకృష్ణ కవి కళాక్షేత్రంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు తెనాలి పట్టణంలో 151 గ్రూప్‌లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఒక్కో బూత్ పరిధిలో ఒక్కో గ్రూపు సభ్యులను నియమించడం జరిగిందన్నారు. వారందరూ బూత్‌ల పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ఓటు ఆవశ్యకతను అందరికీ తెలియజేయాలని సూచించారు. అలాగే ఎన్నికల కమిషన్ రూపొందించిన యాప్‌లను ఉపయోగించే విధంగా చూడాలన్నారు. ఓటు ఉందా లేదా, నియోజకవర్గ పరిధిలో ఏ రాజకీయ పార్టీ తరపున ఎవరు పోటీ చేస్తున్నారు..పోలింగ్ బూత్ వివరాలు వంటివి యాప్‌లో పొందుపరచడం జరిగిందన్నారు. అలాగే ఓటు వేసే విధానాన్ని కూడా అందరికీ తెలియజేయాలని సూచించారు. ఎక్కడైనా అక్రమాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే వీడియోలు తీసి ఉన్నతాధికారులకు అందజేయాలని చెప్పారు. అసిస్టెంట్ కమిషనర్ కె.అనూష మాట్లాడుతూ గ్రూప్‌లో బీఎల్‌వో, ఏఎన్ఎం, ఆశా వర్కర్, డ్వాక్రా గ్రూపు సభ్యురాలు, వెల్ఫేర్ సెక్రటరీ ఉంటారని చెప్పారు. వీరందరూ తమకు కేటాయించిన పోలింగ్ బూత్ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లాల్సి ఉంటుందని వివరించారు. ప్రజలందరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేలా చూడాలన్నారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఓటర్ సెల్ఫీ వద్ద అందరూ ఫోటోలు దిగారు. కార్యక్రమంలో పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ఓటర్ సెల్ఫీ దిగిన కమిషనర్ శేషన్న

వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయండి



ఎమ్మెల్యే శివకుమార్, బీసీ సెల్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావును సన్మానిస్తున్న నాయకులు

తెనాలిఅర్బన్: వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపునకు కృషి చేయాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సూచించారు. వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ బీసీ సెల్ క్లస్టర్ అధ్యక్షునిగా నూతనంగా నియమితులైన పెదలంక వెంకటేశ్వరరావు బుధవారం ఎమ్మెల్యే శివకుమార్‌ను ఆయన కార్యాలయంలో కలిశారు. తన నియామకానికి కృషి చేసినందుకు కృతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం పార్టీ నాయకులు వారు ఇరువురిని సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–2 అధ్యక్షుడు షేక్ దుబాయ్‌బాబు, కౌన్సిలర్లు తాడిబోయిన రామయ్య, అవుల కోటయ్య, వైఎస్సార్ సీపీ నాయకులు ఉడుముల మహేష్‌రెడ్డి, తోట వాసు, శ్రీమోను, ఆరాధ్యుల నరేంద్ర, షేక్ పెద్ద సుభానీ, వై.సుబ్రమణ్యం, మేకల సురేష్, ఎం.కృష్ణారెడ్డి, కె.మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర: వైఎస్సార్ సీపీ కొల్లిపర మండల ఎస్సీ సెల్ అధ్యక్షునిగా నియమితులైన కొల్లిపర గ్రామానికి చెందిన ఆరె సురేష్ బుధవారం తెనాలి లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో తన మిత్ర బృందంతో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యకర్తలుగా ఉన్న తమకు ప్రభుత్వంలో పదువులు రావటానికి సహకరించినందుకు ఎమ్మెల్యే శివకుమార్‌కు ప్రత్యేక కృతజ్ఞులు తెలిపి గజమాలతో సత్కరించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో పార్టీ గెలుపుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు.

సీఎం జగన్‌తోనే సంక్షేమ పథకాల కొనసాగింపు



టీడీపీ మాజీ కౌన్సిలర్ సాంబశివరావును ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి పుష్ప

తెనాలిఅర్బన్: రాష్ట్రంలో సంక్షేమ పథకాలు కొనసాగాలంటే మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీకి ఓట్లు వేసి గెలిపించాలని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం సాయంత్రం 29వ వార్డు సుల్తానాబాద్‌లోని అమ్మవారి ఆలయం దగ్గర నుంచి పర్యటించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమాన్ని తెలియజేసి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్‌చైర్మన్ అలమూరి విజయలక్ష్మి కుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు రమావత్ శ్రీను నాయక్, కఠారి హరీష్, పెద్ద సంఖ్యలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కఠెవరంలో మూడో రోజు ఎన్నికల ప్రచారం

తెనాలిటౌన్: రూరల్ మండలం కఠెవరం గ్రామంలో ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు సత్యనారాయణ నిర్వహిస్తున్న ఎన్నికల ప్రచారం బుధవారం మూడో రోజు జరిగింది. పార్టీ నాయకులతో కలసి ఇంటింటికి తిరిగి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో పార్లమెంటు అభ్యర్థి కిలారి వెంకట రోశయ్య, ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్‌లను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ప్రచారానికి విశేష స్పందన లభించింది. ప్రచారంలో జెడ్పీటీసీ సభ్యురాలు పిల్లి ఉమా ప్రణతి, ఎంపీటీసీ సభ్యులు మైలా భానుప్రసాద్, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, మండల పార్టీ ఉపాధ్యక్షుడు సంకురు బుజ్జిబాబు, డీసీఎంఎస్ డైరెక్టర్ ప్రసాదం బాలగురవమ్మ, గ్రామ ఉపసర్పంచ్ షేక్ బాబు సాహెబ్, మండల పార్టీ ఎస్సీసెల్ అధ్యక్షులు పినపాటి అనిల్‌కుమార్, పార్టీ గ్రామ కన్వీనర్ తమ్మా శివారెడ్డి, పంచాయతీ వార్డు సభ్యులు బొనిగల సునీత, కొత్తపల్లి సుదర్శన్, ముక్కాల మహేష్, పార్టీ నాయకులు మంచాల శ్రీనివాసరావు, ఎల్.చిన్నిబాబు, బొనిగల సురేష్, షేక్ ఆదాం షఫీ, తుల్లిమిల్లి సువర్ణబాబు, ఆర్.శ్రీనివాసరెడ్డి, మాదాల శివన్నారాయణ, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెమ్మసాని వ్యాఖ్యలపై ముస్లిం నేతల మండిపాటు

క్షమాపణ చెప్పాలని డిమాండ్



నిరసన తెలియజేస్తున్న ముస్లిం నేతలు

తెనాలి: టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి గుంటూరు ఎంపీ అభ్యర్థిగా పోటీలో ఉన్న పెమ్మసాని చంద్రశేఖర్ ఇరాక్ అధ్యక్షుడు దివంగత సద్దాం హుస్సేన్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలపై స్థానిక ముస్లిం మైనారిటీ నాయకులు అభ్యంతరం వ్యక్తం చేశారు. చంద్రశేఖర్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. ముస్లిం సమాజానికి ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజి రోడ్డులోని జామియా మసీదు వద్ద బుధవారం ముస్లిం మైనారిటీ నాయకులు పెమ్మసాని చంద్రశేఖర్ వ్యాఖ్యలను నిరసిస్తూ నినాదాలు చేశారు. ముస్లిం నేతలు గోల్డ్ రహీమా, సుభాని తదితరులు మాట్లాడుతూ చిన్న దేశాలకు మద్దతుగా నిలిచి అగ్రరాజ్యాల కుట్రలో వీరమరణం పొందిన సద్దాం హుస్సేన్ గురించి పెమ్మసానికి ఏం తెలుసని ప్రశ్నించారు. సద్దాం హుస్సేన్ మరణిస్తే అనేకమంది తమ పిల్లలకు ఆయన పేరు పెట్టుకున్నారని గుర్తుచేశారు. విదేశాల్లో ఉంటూ ఇప్పుడు రాజకీయ రంగ ప్రవేశం చేసి ఎంపీగా పోటీచేస్తున్న పెమ్మసాని తన ఎన్నికల ప్రచారంలో భాగంగా ముస్లిం సమాజం బాధపడేలా సద్దాం హుస్సేన్‌పై ఇష్టా రీతిన మాట్లాడటం దారుణమన్నారు. కార్యక్రమంలో ముస్లిం నేతలు చాన్‌బాషా, టెక్స్ బాల, ఐరన్ షరీఫా, అన్సారీ, పెచ్చింగ్ సుభాని, రియాజ్, సర్దార్, సాదిక్, షాజహాన్, దౌలత్, రబ్బురాజ్ తదితరులు పాల్గొన్నారు.

చర్చిలో మురుగుడు లావణ్య ప్రత్యేక ప్రార్థనలు



మంగళగిరి: చినకాకాని హోసన్నా చర్చిలో బుధవారం వైఎస్సార్ సీపీ నియోజకవర్గ అభ్యర్థి మురుగుడు లావణ్య, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమలలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. చిన కాకానిలో పలు కార్యక్రమాలకు హాజరైన లావణ్య చర్చిలో పాస్టర్ ప్రదీప్ నిర్వహించిన ప్రార్థన కూడికలో పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా లావణ్య మాట్లాడుతూ శ్రమల దినాల్లో శుభ శుక్రవారానికి ముందు క్రీస్తు ప్రేమను గురించి ఆయన రాకడ ఉద్దేశాన్ని గురించి ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.20.22 లక్షలు



హుండీ లెక్కింపు నిర్వహిస్తున్న దృశ్యం

తెనాలి: స్థానిక వైకుంఠపురంలోని శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపు జరిగింది. దేవస్థానం పాలక మండలి చైర్మన్ కుంభం సాయిబాబు, పాలక మండలి సభ్యులు, ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తిమ్మానాయుడు ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు లెక్కింపు నిర్వహించారు. పర్యవేక్షణ అధికారిగా శ్రీ సీతారామాంజనేయ స్వామి దేవస్థానం సహాయ కమిషనర్ జి.అమర్‌నాథ్ వ్యవహరించారు. పట్టణానికి చెందిన పలువురు భక్తులు, సేవా సంస్థల ప్రతినిధులు వంద మంది వరకు స్వచ్ఛందంగా లెక్కింపులో పాల్గొన్నారు. గడచిన 52 రోజులకు గాను రూ.20,22,304లు హుండీ ఆదాయం లభించింది. కొన్ని గ్రాముల బంగారం, వెండి సైతం భక్తులు సమర్పించారు. పాలక మండలి సభ్యులు కనికచర్ల చరణరత్న సందీప్, వంగల జగదీశ్వరి, కురగంటి సునీత, బొద్దులూరు సరస్వతి నాగేశ్వరరావు, మావులూరి శ్రీనివాస్, ముంతా దుర్గాప్రసాద్, బట్టు దుర్గారావు, దేవరకొండ వెంకటరమణ, అశహరి రవికుమార్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చెంచుపేట సిబ్బంది, భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్, దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.

రైలు కిందపడి యువకుడి ఆత్మహత్య

తెనాలిరూరల్: కుటుంబ కలహాల నేపథ్యంలో యువకుడు రైలు కింద పడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ చినరావూరుకు చెందిన గోపికృష్ణ(27) చేపలు విక్రయిస్తుంటాడు. మొదటి భార్యతో విడిపోయిన అతను పొన్నూరుకు చెందిన మహిళను రెండో వివాహం చేసుకున్నాడు. ఇటీవలి కాలంలో వీరి కుటుంబంలో తరచూ ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ క్రమంలో బుధవారం చినరావూరు స్టేషన్ సమీపంలో రైలు కింద పడి ఆత్మహత్యాయత్నం చేశాడు. తీవ్ర గాయాలపాలైన అతన్ని స్థానికులు 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. వైద్యశాల నుంచి వచ్చిన సమాచారం మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు జీఆర్పీ పోలీసులు తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

తెనాలిరూరల్: ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు సీజ్ చేశారు. తెనాలి ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఏవీ చలం ఆధ్వర్యంలో కొల్లిపర మండలంలో బుధవారం వాహనాల తనిఖీ నిర్వహించారు. రెండు లారీలు పత్రాలు లేకుండా 60 టన్నుల ఇసుక తరలిస్తున్నట్టు గుర్తించి వాటిని సీజ్ చేసి కొల్లిపర పోలీసులకు అప్పగించారు.

అమ్మవారి హుండీ ఆదాయం రూ.11,51లక్షలు

తాడేపల్లిరూరల్: గుంటూరు జిల్లా, దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళి అమ్మవారి దేవస్థానం హుండీ కానుకల లెక్కింపు కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కార్యనిర్వహణాధికారి డీసీహెచ్ వెంకటరెడ్డి మాట్లాడుతూ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలో భక్తులచే సమర్పించబడిన హుండీ కానుకలను దేవస్థానంలోని 9 హుండీలను కాజ గ్రూపు దేవాలయాలు, దేవదాయ శాఖ గ్రేడ్–1 కార్యనిర్వహణాధికారి పి.వెంకటరెడ్డి ఆధ్వర్యంలో తెరిచి కానుకలు లెక్కించగా రూ. 11,54,564/– ఆదాయం లభించిందని తెలిపారు. ఈ హుండీల లెక్కింపు కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగప్రసాద్, దేవస్థానం సిబ్బంది, అర్చకులు, స్వచ్ఛంద సేవా సంస్థలు, భక్తులు పాల్గొన్నారని తెలిపారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం..

తాడేపల్లిరూరల్: దుగ్గిరాల మండల పరిధిలోని కంఠంరాజు కొండూరు గ్రామంలో వేంచేసియున్న మహంకాళీ అమ్మవారి దేవస్థానానికి దాతలు బుధవారం రూ.1,00,116లు అందజేశారు. ఆలయ ఈవో చినవెంకటరెడ్డి మాట్లాడుతూ తెనాలి వాస్తవ్యులు రావి అంకినీడు ప్రసాద్ దంపతుల కుమార్తె రావి గీతిక దంపతులు ఈ విరాళాన్ని అందజేశారని తెలిపారు.